ఉపాధి అలవెన్స్‌లకు 'సాఫ్ట్‌వేర్' బ్రేక్

- కేంద్రం అమలు చేస్తున్న కొత్త సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు అందని అలవెన్స్‌లు
- తట్ట, బుట్ట, గడ్డపార చార్జీలూ నిలుపుదల
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కూలీలు



ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

బనగానపల్లెరూరల్: ఉపాధి కూలీల వేసవి అలవెన్స్‌లకు కొత్త సాఫ్ట్‌వేర్ బ్రేక్ వేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలులో ఉన్న రాష్ట్ర సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అందాల్సిన పలు రకాల అలవెన్స్‌లు నిలిచిపోయాయి. తట్ట, బుట్ట, గడ్డపార, తాగునీటి అలవెన్స్‌లతోపాటు మేట్ చార్జీలు నిలిచిపోయాయి. ప్రత్యేకించి ఉపాధి హామీ పనులు వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకొని పని చేయాల్సి ఉంటుంది. ఎండ ప్రభావంతో కూలీలు చేయు పని కూడా తగ్గుతుంది. అయితే ప్రభుత్వం సాధారణ పని దినాల్లో కూలీలకు ఇచ్చే వేతనం ఏ మాత్రం తగ్గకుండా వేతనం లభించేలా ప్రతిఏటా వేసవి ప్రారంభం నుంచి ముగిసే వరకు అదనపు కూలీ చెల్లిస్తుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచి జూన్ చివరి వరకు అదనపు కూలీ రేట్లు వర్తించే విధంగా ప్రభుత్వం వేసవి ప్రారంభంలోనే ఉత్తర్వులు జారీ చేసేది. వేసవి డ్రై అలవెన్స్‌ల రూపంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం చొప్పున వేతనం అదనంగా తీసుకునేవారు ఉపాధి కూలీలు. వేసవిలో తక్కువ పని చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కూలి పొందేవారు కూలీలు. వేసవిలో వ్యవసాయ పనులు అరకొరగా ఉన్న సమయంలో కూలీలు అలవెన్స్‌లను సద్వినియోగం చేసుకునేవారు. దీంతో వేసవి కాలంలో రోజురోజు కూలీల సంఖ్య పెరుగుతుండేది కూడా.

కేంద్రం అమలు చేసిన సాఫ్ట్‌వేర్‌తో తగ్గిన కూలి

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీసీఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలు జరిగేవి. ఇందులో గుర్తించిన పనుల వివరాలను అప్‌లోడ్ చేసి ఎస్టిమేషన్ జనరేట్ చేసేవారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా మన రాష్ట్రంలోని పరిస్థితులకు అనుకూలంగా పనులను చేసేవారు. ఈ మేరకు వేసవిలో కూలీలకు ప్రత్యేక అలవెన్స్‌లు వర్తింపు జరిగేది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 2021 నవంబర్ నుంచి ఒకే సాఫ్ట్‌వేర్ అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్(ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. అన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పథకం కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. దీంతో రాష్ట్రంలో వేసవి అలవెన్స్‌లు ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. గతంలో పనిముట్లు వాడకానికి రోజుకు రూ.5ల చొప్పున ఇచ్చే తట్ట బుట్టచార్జీలు, రోజుకు రూ.15లు ఇచ్చే గడ్డపార చార్జీలు సైతం నిలిచిపోయాయి. వేసవిలో దాహార్తిని తీర్చుకోడానికి ఒక్కో కూలీకి రోజుకు రూ.5, మిగిలిన కాలంలో రూ.2.50 చొప్పున చెల్లించే అలవెన్స్‌లు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. అదేవిధంగా గ్రూపు మేట్‌కు ఆ రోజు పని చేసిన కూలీల సంఖ్యను మేరకు ఒక్కొక్క కూలీకి రూ.3 చొప్పున చార్జీలు ఇచ్చేవారు. ఇది కూడా నిలిచి పోయిందని మేట్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కూలీలు తమ నివాసం నుంచి పని ప్రదేశం వరకు ఇచ్చే రవాణా చార్జీలు మాత్రం కొనసాగుతున్నాయి. వేసవి అలవెన్స్‌లు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

మేట్ చార్జీలు రావడంలేదు



నేను ప్రతిరోజు పని ప్రదేశంలో గ్రూపు సభ్యుల హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. అలా గే ఆ రోజు వచ్చిన కూలీల సంఖ్యను మేర కు గరిష్టవేతనం పడటానికి చేయాల్సిన మార్కింగ్ ఇవ్వాల్సి ఉంటుంది.అధికారులు పని ప్రదేశంలో కొలతలు వేయడానికి వచ్చిన సమయంలో వారికి అందుబాటులో ఉండాలి. గతంలో మేట్‌చార్జీలను చెల్లించేవారు. కొంత మేర ఉపశమనంగా ఉండేది. ప్రస్తుతం రావడంలేదు.

– షేకున్‌బీ, మేట్,భానుముక్కల గ్రామం

తాగునీటి చార్జీలు నిలిచిపోయాయి



గతంలో కూలీలకు అలవెన్స్‌ల రూపంలో ఇచ్చి తట్ట బుట్ట, గడ్డపార చార్జీలు, తాగునీటి చార్జీలను ఇవ్వడంలేదు. అధికారులను అడిగితే ప్రస్తుతం నిలిచిపోయి అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు అలవెన్స్‌ల రూపంలో వచ్చే మొత్తాన్ని అమలు చేస్తే ఉపయోగంగా ఉంటుంది.

– గోవిందమ్మ, ఉపాధి కూలీ,బనగానపల్లె

వేసవి అలవెన్స్‌లను కొనసాగించాలి



గతంలో వేసవిలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి అలవెన్స్‌లను ఇచ్చే వారు. ఎండ ప్రభావంతో కొంత తక్కువ పనిచేసిన సాధారణ రోజుల్లో వచ్చే కూలి వచ్చేది. వేసవి అలవెన్స్‌లు నిలిపివేయడంతో ప్రస్తుతం తక్కువగా కూలి వస్తుంది.కేంద్ర ప్రభుత్వం అలవెన్స్‌లను తిరిగి కొనసాగించాలి.

– వెంకటలక్ష్మమ్మ,అప్పలాపురం,ఉపాధి కూలీ

అలవెన్స్‌లు నిలిచింది వాస్తవమే



ఉపాధి కూలీలకు వేసవి కాలంలో ఇచ్చే ప్రత్యేక అలవెన్స్ నిలిచిపోయింది వాస్తమే. గతంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జీఎస్ కార్యకలాపాలు కొనసాగించడం జరిగింది.అయితే 2021 నవంబరు నుంచి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తీసుకు రావడంతో అలవెన్స్‌లు నిలిచిపోయాయి.వేసవి అలవెన్స్‌లు ఉపాధి కూలీలకు ఊరటగా ఉండేది. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– శ్రీవిద్యా, డోన్ క్లస్టర్ డ్వామా ఏపీడీ

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- చెర్లోపల్లె నుంచి కొలిమిగుండ్ల వరకు బైక్ ర్యాలీ
- ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో భారీ సభ

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల కేంద్రం కొలిమిగుండ్లలో దాదాపు రూ.3కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం అట్టహాసంగా ప్రారంభించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు గ్రామ సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్, ఉద్యాన పంటల సేకరణ కేంద్రం, సీసీ రోడ్లు, క్లోజింగ్ డ్రేనేజీలతో పాటు పలు పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి హాజరు కానున్నారు. అవుకు మండలం చెర్లోపల్లె నుంచి కొలిమిగుండ్ల మండల పరిషత్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. అభి వృద్ధి పనుల ప్రారంభోత్సం అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో భారీ సభ నిర్వహించనున్నారు. మండలంలోని సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు,వైఎస్సార్‌సీపీ శ్రేణులు,అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతంచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

బేతంచెర్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవి తేజ అన్నారు. గతంలో బేతంచెర్ల స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు బదిలీపై ప్రకాశం జిల్లాకు బదిలీ కా గ ఆయనస్థానంలో మచిలిపట్నంలో విధులు నిర్వహిస్తున్న రవి తేజ ఇక్కడికి వచ్చారు.ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రవితేజ తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

ప్యాపిలి: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, గార్లదిన్నె సర్పంచ్ సీమ మనోహరమ్మ అన్నారు. మండల పరిధిలోని మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. నాయకుల సిఫారసు లేకుండా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని ఈ సందర్భంగా వారు తెలిపారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఆదర్శ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామం అభివృద్ధికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, వీఆర్ఓ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా జగనన్న పాలన

- పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల



బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వం సంక్షేమ పథకాలను పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక, ఇతర కారణాల మూలంగా ఏ ఒక్క పేద ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంలో సీఎం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని కమ్మవారిపల్లె, లక్ష్మంపల్లె, పెద్దవెంతుర్ల గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ దోనీ అల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తదితర అధికారులు, ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో వారు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ అందజేశారు. జల కళ ద్వారా పొలాల్లో బోర్లు వేయించాలని, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేయించాలని కోరగా పరిష్కార చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రజలకు ప్రభుత్వం నుంచి మేలు జరుగుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు మాయమాటలతో మభ్యపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు జగనన్నకు అండగా ఉన్నారని, ఎంత మంది వచ్చినా జగనన్న మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల వద్దకు నేరుగా ఎమ్మెల్యేలు వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్న తీరును టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కోరారు.

ఆర్‌బీకే, అంగన్‌వాడీ ప్రారంభం

పెద్ద వెంతుర్లలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.14.70 లక్షలతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం భవనాలతో పాటు మండల పరిషత్ నిధులతో కొత్తగా వేసిన బోరు, పైపులైన్‌ను ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల సర్పంచ్‌లు కొండయ్య, పద్మాంజలిదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి,రావి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, రంగయ్య, కామేశ్వరరెడ్డి, రామ్మోహన్, రాఘవరెడ్డి, శ్రీను, రాజు, వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సందర్శించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని గ్రామ సచివాలయా ల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించాలని గ్రామ సచివాలయ మండల కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు.

జగనన్న సురక్షపై నిర్లక్ష్యం వహించొద్దు

అవుకు: జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించవద్దని ఈఓపీఆర్డీ రామకృష్ణవేణి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సంగపట్నంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజ లకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ చిన్న కారణం మూలంగా ఆగిపోకూడదని, ప్రభుత్వ సేవలను కూడా మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది నాగలక్ష్మి,రవి, మౌనిక, భాగ్యవతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సంజామల: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముక్క మల్ల సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల లక్ష్యంగా గుర్తించి అధికారులు దృష్టికి తీసుకు రావాలని వలంటీర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ అమీర్, పంచాయతీ కార్యదర్శి దినేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు గ్రామ శివారులోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడిచేసి వారి నుంచి రూ. 2,400, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద మంగళవారం ఆటో దిగుతున్న మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు చౌడమ్మను మరో ఆటో ఢీకొనడంతో గాయాలయ్యా యి. చౌడమ్మ కాలికి తీవ్ర గాయాలు కావడంతో డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

కోవెలకుంట్ల: పట్టణంలోని నాట్ల కాంప్లెక్స్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు రామసుబ్బయ్య(66) మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన రామసుబ్బయ్య నడుచుకుంటూ వెళ్తుండగా కోవెలకుంట్లకు చెందిన జిలానీబాషా బైక్‌తో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన రామసుబ్బయ్యను చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృత్యువాత పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో ఢీకొని యువకుడు మృతి

డోన్ టౌన్ : మండల పరిధిలోని వెంకటనాయుని పల్లె గ్రామ సమీపంలో మంగళవారం బైకుపై వెళ్తున్న రమేష్(25)ను ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు రమేష్ డోన్ పట్టణం నుంచి స్వగ్రామానికి బైకుపై వస్తుండగా రైల్వే గేట్ల సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని డోన్ ప్రభుత్వ వైదశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతునికి భార్య సురేఖతో పాటు కుమారుడు ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా తయారీ మానుకోండి



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

అవుకు: పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సారా తయారీ మానుకోవాలని సెబ్ ఏఈఎస్ శ్రీధర్ రావు సూచించారు. మండల పరిధిలోని మర్రికుంట తండా గ్రామ సమీపంలోని కొండల్లో నాటుసారా తయారీ చేస్తున్నరని సమాచారం మేరకు మంగళవారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు బట్టీలను ధ్వంసం చేసి, 1700 లీటర్ల సారా ఊటను ప్రారబోశామని సెబ్ ఎస్ఐ దౌలత్ ఖాన్ తెలిపారు. సారా బట్టీలు అదే గ్రామానికి చెందిన ముడావత్ మద్దిలేటి నాయక్, గోవిందు నాయక్,దుబ్బ తులసి నాయక్, రాముడు నాయక్, ప్యాపిలి మండలం సీతమ్మతాండాకు చెందిన దేశావత్ పెద్ద సేవియా నాయక్‌లవి గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేయటం వలన కలిగి నష్టాలను, దాని వల్ల కలిగే దుష్పరిణామాలను గ్రామస్తులకు వివరించారు. సారా తయారీ చేసిన, అమ్మిన కేసులు నమోదు చేస్తామని శ్రీధర్ రావు హెచ్చరించారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

బనగానపల్లెరూరల్: సెబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా విక్రయదారులుపై దాడులు నిర్వహించినట్లు సెబ్ స్టేషన్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని తెలుగుపేటలో యాతం లక్ష్మీదేవి, మండలంలోని పెద్దరాజుపాళెంలో గ్రామానికి ఆదినారాయణ నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

డోన్: మున్సిపల్ సర్వ సభ్య సమావేశం మంగళవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సాదాసీదాగా జరిగిన ఈ సమావేశంలో పట్టాభివృద్ధితో పాటు 23 అంశాలకు సంబంధించి తీర్మానాలను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రతిపాదించగా సభ్యులు ఏక గ్రీవంగా ఆమోదించారు. ప్రధానంగా గాంధీ సర్కిల్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రహదారికి బుగ్గన మార్గ్ అనే పేరు పెట్టేందుకు సభ తీర్మానించిందని చైర్మన్ రాజేష్ తెలిపారు. అలాగే ఐసీడీఎస్ భవనానికి తక్షణం మరమత్తులు చేసే తీర్మానానికి సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కోట్రికె హరికిషన్‌తో పాటు 30మంది కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదాం

డోన్ టౌన్ : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదామని ప్రిన్స్‌పాల్ నాగజాస్మిన్ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం పేరేంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని, తల్లిదండ్రులు తమ పిల్లలు స్కూల్‌కు హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

30న ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న 7,8,9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ నాగజాస్మిన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేది ఉదయం 9గంటల నుంచి 10.30గంటల మధ్య దరఖాస్తు సమర్పించిన వారికి 11గంటల నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా పంచాయతీ అధికారి మంజుల



ఆర్ ఎస్ రంగాపురంలో తాగునీటి ట్యాంక్ పరిశుభ్రత తేదీని పరిశీలిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి మంజుల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్, ఆర్ ఎస్ రంగాపురం గ్రామ పంచాయతీలను ఆమె తనిఖీ చేశారు. గ్రామాల్లో పూర్తయిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. నెలలో రెండుసార్లు తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయించాలని, క్రమం తప్పకుండా పారిశుద్య పనులు చేపట్టి బ్లీచింగ్ ఫౌడర్ చల్లించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె సూచించారు. సిమెంట్ నగర్ గ్రామంలో చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి స్థల ప్రతి పాదనలు పూర్తి చేసి నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్ ఎస్ రంగాపురంలో మధ్యలో నిలిచిపోయిన చెత్త సంపద కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈన్‌చార్జ్ ఈఓఆర్డీ ఈశ్వరన్న, సర్పంచ్ గుమ్మగాల్లరాజు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని ఎంఈఓ యశోధ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దిందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు నాగేశుడు, శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, సుధీర్, రమేష్, శ్రీపతి, మల్లికార్జున పాల్గొన్నారు.

మంత్రి బుగ్గన పర్యటనను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బొరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ నెల 29 వ తేదీన ప్యాపిలిలో పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీఐసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 29 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక లక్ష్మీనరసింహా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే 'యువత కోసం బుగ్గన' కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం ప్యాపిలిలో ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ నిర్మాణ పనులు, పార్కు నిర్మాణ పనులను మంత్రి పరిశీలిస్తారని తెలిపారు. అలాగే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రఘు, గండికోట రామాంజనేయులు, వెంకటనారాయణ, కొండయ్య, పుల్లారెడ్డి, బషీర్, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నిజాం, గాజుల నరసింహులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీ చౌడేశ్వరిదేవికి వెండి గిన్నెల విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి భక్తులు తొమ్మిది వెండి గిన్నెలను విరాళంగా అందజేశారు. దాదాపు రూ.82, 657 విలువ వెండి గిన్నెలను హైదరాబాద్‌కు చెందిన వేమూరి కిరణ్ కుమార్, గౌరి దంపతులు ఇచ్చారని ఈఓ రామానుజన్ తెలిపారు. దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలోని హుస్సేనాపురం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనంద ఆచారి పలక, నోట్ పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్‌ఎం మద్దిలేటినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మనంద ఆచారి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడితోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, పాఠశాల చైర్మన్ మహమ్మద్‌సలార్, శివనారాయణ ఆశావర్కర్ పాల్గొన్నారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

బేతంచెర్ల: మన బడి–నాడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టుకుందని, రూపురేఖలు మారిపోయాయని గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు అన్నారు. బుధవారం అమ్మఒడి నాల్గవ విడత నగదును తల్లుల ఖాతాల్లో సీఎం జమ చేయనున్న సందర్భంగా మంగళవారం గూటుపల్లె జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధికి ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాలను సర్పంచ్ వివరించారు.

శ్మశానవాటిక దారిలో కంపచెట్లు తొలగింపు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని హిందూ శ్మశాన వాటిక వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఉలవల నరసింహుడు సొంత ఖర్చుతో జేసీబీ సాయంతో తొలగించారు. ప్రధాన రహదారిలోని బ్రిడ్జి కింద నుంచి శ్మశాన వాటిక వరకు చేరుకునే కంపచెట్లతో పాటు చెత్తచెదారంపేరుకుపోయి అస్తవ్యస్థంగా తయారైంది. దీంతో జేసీబీ ఏర్పాటు చేయించి రహదారిని శుభ్రం చేయించారు.

సన్మానం

బనగానపల్లె: ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమనివైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం మల్లికార్జున నాయక్, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, నాగరాజు, హుస్సేనయ్య, హనుమంతు, పెద్దన్న శేఖర్‌ను సన్మానించారు. వీరికి గుండం శేషిరెడ్డితోపాటు గ్రామపెద్దలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుల సేవలను ఆయన గుర్తు చేశారు.

తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

బేతంచెర్ల: ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రజ్ఞ జూనియర్ కళాశాల్లో ఇండియన్ ఓలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీలలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో బేతంచెర్ల పట్టణానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు. 300 మంది పాల్గొన్న ఈపోటీల్లో 13 మంది బేతంచెర్ల చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు మంగళవారం మెడల్స్ సాధించిన చిన్నారులను శిక్షకులు వెంకటేష్, నాగన్న, తల్లిదండ్రులు అభినందించారు.

బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్యాపిలి: ముస్లిం సోదరులు ఈ నెల 29న నిర్వహించుకునే బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శ్రీరాములు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ ముస్లింలకు అత్యంత ముఖ్యమైన పండుగ అన్నారు. కులమతాలకు అతీతంగా అందరం స్నేహ భావంతో మెలగాలన్న సందేశాన్ని అన్ని పండుగలు తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూహక్కుపై అవగాహన

డోన్ టౌన్ : జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల విమల కోరారు. స్థానిక 16వ సచివాలయంలో మంగళవారం వలంటీర్లతో సచివాలయం సిబ్బందితో భూహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా చేకూరే లాభాలను ప్రజలకు వివరించాలని వారు వలంటీర్లకు సూచించారు.

ఎర్రజాల గుహల పరిశీలన

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కర్నూలు రహదారిలో 41 ఎకరాలల్లో ఏర్పాటు కానున్న ఆటో నగర్ భూమిపూజ, కనుమ కింది కొట్టాల గ్రామంలో ఎర్రజాల గుహల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరిశీలించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆటోనగర్, కనుమ కింది కొట్టాల సమీపాన ఉన్న ఎర్రజాల గుహల వద్ద ఏర్పాట్లను మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషనం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడులు వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు పరిశీలించారు.